నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
10 | వరంగల్, గురువారం 20 మార్చి 2025 | MAHABUBABAD

బడ్జెట్ ప్రతుల దహనం

హనుమకొండ చౌరస్తా, మార్చి 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించకపోవడంతో కాకతీయ డిగ్రీ కళాశాల ఎదుట ఉమ్మడి వరంగల్ జిల్లా పీడీఎస్యూ ఆధ్వర్యంలో బుధవారం బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. పీడీఎస్యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ మాట్లాడుతూ వెంటనే 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యులు ఉడత గణేశ్, రాజేశ్, అనిల్, సాయి, వంశీ పాల్గొన్నారు. అలాగే 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేయూ మొదటి గేట్ ఎదుట బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కారు కావాలనే విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించిందన్నారు. కేయూ అధ్యక్షుడు పురుషోత్తం సాయికుమార్, ఉపాధ్యక్షురాలు ఎం పరిమళ, సహాయ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, చెన్నూరి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న పీడీఎస్యూ నాయకులు

మ్యానిఫెస్టోకు, ప్రతిపాదనలకు పొంతన లేదు

హనుమకొండ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం, గృహనిర్మాణ రంగాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి నిధుల కేటాయింపు పెంచాలి. లేకపోతే ఆందోళనలు, ఉద్యమాలు తప్పవు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు, ప్రస్తుత ప్రతిపాదనలకు ఎలాంటి పొంతన లేదు. హైదరాబాద్ తరువాత రెండవ రాజధానిగా పేర్కొంటున్న వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదు. నాలుగు రోజుల క్రితం స్టేషన్ ఘనపూర్‌లో జరిగిన సభలో సీఎం వరంగల్ నగరాభివృద్ధికి చిత్తశుద్ధితో ఉన్నామని చెప్పినా, బడ్జెట్ కేటాయింపుల్లో అది ప్రతిబింబించలేదు. నగరంలో అండర్ డ్రైనేజీ, మామునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి నిధులపై స్పష్టత లేదు. వరంగల్-హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం విస్మరించింది. ఇండ్లు లేని కుటుంబాలు 30 లక్షలుంటే కేవలం 4.50 లక్షల మందికి మాత్రమే ఇవ్వడానికి ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా ఆరు గ్యారెంటీల అమలు జరిగే అవకాశం లేదు. కేవలం ప్రచారం కోసమే ఈ బడ్జెట్ ఉంది.

– జీ ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి

మనకు నిరాశే..

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు అన్యాయం

- భట్టి పద్దులో ఉమ్మడి జిల్లా ఊసేలేదు..
- వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరు లేదు
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రస్తావన రాలే
- ఎయిర్‌పోర్టు అభివృద్ధికి కేంద్రం నిధులేనట
- దేవాదులకూ అరకొర నిధులే

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు అన్యాయమే జరిగింది. అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎలాంటి నిధులను కేటాయించకపోవడం నిరాశే మిగిల్చింది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయలేదు. కేసీఆర్ ప్రభుత్వం మొదలుపెట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కేటాయింపు ప్రస్తావన ఎక్కడా లేదు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో అరకొర నిధులు విదిల్చి కాంగ్రెస్ సర్కారు మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. అసెంబ్లీ ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన వాటికీ భట్టి పద్దులో చోటుదక్కకపోవడంపై అన్ని వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

- వరంగల్, మార్చి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

గ్రేటర్ వరంగల్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం బడ్జెట్‌లో ఎలాంటి పద్దు కేటాయించలేదు. యూజీడీ కోసం రూ.4,170 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్ 17న ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ బడ్జెట్‌లో మాత్రం ప్రస్తావించలేదు. దీంతో నిర్మాణ పనులు మొదలవుతాయా లేదా అనే సందేహం నెలకొంది. వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నర క్రితం అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఏడాదిన్నర గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నిధులపై స్పష్టత ఇవ్వడం లేదు. ఓ జీవో ఇచ్చి చేతులు దులుపుకొన్నది. అంతేగాక స్మార్ట్‌సిటీ, అమృత్ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.500 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం రూ.178 కోట్లను కేటాయించినట్లు బడ్జెట్‌లో పేర్కొన్నది. నగర అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం 2016-17లో రూ.250 కోట్లను ప్రత్యేకంగా కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి నిధులు బడ్జెట్‌లో లేవు.
- మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతులు మంజూరు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు మొదటి నుంచి 696 ఎకరాల భూమి ఉన్నది. కాగా మరో 253 ఎకరాలు అవసరమవుతుందని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కమిటీ సూచించింది. అదనపు భూసేకరణ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సూచించింది. ఈ భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2024 నవంబర్ 17న రూ.205 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను ఇప్పటికే మంజూరు చేశామని బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వం పేర్కొన్నది. కానీ నిధుల విడుదల గురించి ప్రస్తావించలేదు.
- పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం రూ.1100 కోట్లతో వరంగల్ నగరంలో తలపెట్టిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. చివరి దశలో ఉన్న ఈ హాస్పిటల్‌ను అందుబాటులోకి తెచ్చే విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు.
- కీలకమైన సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులోనూ రాష్ట్ర ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపలేదు. చీఫ్ ఇంజినీర్‌వారీగా సాగునీటి శాఖ నిధులను కేటాయించింది. వరంగల్ చీఫ్ ఇంజినీర్ పరిధిలోని ప్రాజెక్టులకు రూ.307 కోట్లు, కంతనపల్లి చీఫ్ ఇంజినీర్ పరిధిలోని ప్రాజెక్టుల కోసం రూ.25.94 కోట్లు, ములుగు చీఫ్ ఇంజినీర్ పరిధిలోని ప్రాజెక్టులకు రూ.100 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ప్రాజెక్టుల వారీగా ఎంతనేది త్వరలోనే ప్రకటిస్తారని సాగునీటి శాఖ అధికారులు చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు పనుల కోసం రూ.308 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు ఇప్పటికి 30,268 ఎకరాలు సేకరించారు. మరో 2,956 ఎకరాలను సేకరించాల్సి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం బడ్జెట్‌లో పెట్టిన నిధులు భూసేకరణ, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు సరిపోవని సాగునీటి శాఖ అధికారులు వివరించారు.

మ్యానిఫెస్టోకు దూరంగా బడ్జెట్

జనగామ చౌరస్తా : కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలకు ఆమడ దూరంలో ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులున్నాయి. విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి గతేడాది కన్నా 0.20 శాతం తగ్గించింది. గతేడాది విద్యారంగానికి రూ. 21,292 కోట్లు (7.77 శాతం) కేటాయించగా ప్రస్తుతం రూ. 23,108 కోట్లు (7.57 శాతం) మాత్రమే కేటాయించింది. గత బడ్జెట్ రూ. 2,74,058 కోట్లు, ప్రస్తుతం రూ. 3,04,965 కోట్లతో సరిపోల్చితే అంకెల్లో రూ. 1,816 కోట్లు పెరిగినట్లుగా ఉన్నప్పటికీ శాతాల్లో మాత్రం గతేడాది కన్నా తగ్గింది. 26,067 ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం గాలికొదిలేసి, రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌పై మాత్రమే మాట్లాడుతున్నది. గురుకులాల్లో చదివేది 5.5 లక్షల మంది విద్యార్థులే. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో చదివే వారి సంఖ్య 16 లక్షలు. ఇందులో అత్యధికంగా బడుగు, బలహీన వర్గాల పిల్లలున్నారు. వీరికి నాణ్యమైన విద్య అందించేందుకు ఈ కేటాయింపులు సరిపోవు.

–పీ చంద్రశేఖర్‌రావు, టీపీటీఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశాజనకం

మహబూబాబాద్ (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3,04,965 కోట్ల మొత్తం బడ్జెట్‌లో రూ. 23,108 కోట్లు విద్యా శాఖకు కేటాయించింది. అయితే ఈ శాఖకు మరిన్ని నిధులు కేటాయిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. ఐదు పెండింగ్ డీఏలు, పీఆర్సీ ఊసే లేకపోవడం బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు మొండిచేయి చూపింది. ఇప్పటికైనా పునరాలోచించి పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ విడుదల చేయడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించాలి.

– పులి దేవేందర్ ముదిరాజ్, టీపీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి

భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లను బలవంతంగా స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఫిక్స్‌డ్ వేతనం కోసం ఆశవర్కర్ల ధర్నా

భూపాలపల్లి రూరల్ : తమకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ కలెక్టరేట్ల ఎదుట బుధవారం ఆశవర్కర్లు ధర్నా చేశారు. తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఆశ కార్యకర్తలు గేట్లను నెట్టి లోపలికి వెళ్లేందుకు యత్నించగా సుబేదారి పోలీసులు అడ్డుకున్నారు. భూపాలపల్లిలో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలను పోలీసుల బలవంతంగా స్టేషన్‌కు తరలించారు.

భట్టి బడ్జెట్ బడా మోసం

పరకాల : మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ బడా మోసంగా కన్పిస్తున్నది. అసలు బడ్జెట్‌లో ఆదాయ, వ్యయాలకు పొంతన లేదు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలలాగే భట్టి బడ్జెట్ ప్రసంగం కూడా అబద్ధాలతో నిండింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను అమలు చేసే చిత్తశుద్ధి ప్రభుత్వానికి, మంత్రులకు ఉన్నట్లు కనిపించడం లేదు. బడ్జెట్‌లో ఒక్క హామీకి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. అసలు కొన్ని పథకాల అమలు ప్రస్తావనే తీసుకురాకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతున్నది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అందిస్తామన్న కాంగ్రెస్ పెద్దలు తమ పూర్తి కాలంలో కూడా వాటిని అమలు చేసే పరిస్థితి లేదు. మొత్తంగా కాంగ్రెస్ రెండో బడ్జెట్ కూడా వారి పాలన లాగానే అస్తవ్యస్తంగా ఉంది. వరంగల్ ఉమ్మడి జిల్లాకు తలమానికమైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదు.

– చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పరకాల

ఇది ప్రజా, రైతు వ్యతిరేక బడ్జెట్

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టింది ప్రజా, రైతు వ్యతిరేక బడ్జెట్. మొత్తంగా రైతులకు మొండిచేయి చూపింది. ఈ బడ్జెట్‌తో 6 గ్యారెంటీలు అమలు చేయడం అసాధ్యమనేది స్పష్టమవుతున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో 2020-21లోనే రూ. 25,305 కోట్లు, 2021-22లో రూ. 26,822 కోట్లు వ్యవసాయానికి కేటాయించారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి రూ. 24,439 కోట్లే కేటాయించింది. దీంతో రైతు భరోసా అమలు చేయడం కష్టం. ఈ బడ్జెట్ వ్యవసాయానికి పూర్తి వ్యతిరేకం. మహిళలకు ఇస్తామన్న రూ. 2500ల పథకానికి నిధులు కేటాయించకపోవడం దారుణం. ఈ ఏడాది మహిళా, చేయూత పథకం ఎగవేస్తారు. నిరుద్యోగ భృతి ఊసేలేదు. తులం బంగారం ముచ్చట తీయనేలేదు. కాంగ్రెస్ తామిచ్చిన ఆరు గ్యారెంటీలకు ఎగనామం పెట్టేదే ఈ బడ్జెట్.

– పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నర్సంపేట

మాట్లాడుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

'దేవాదుల' నిర్వహణలో కాంగ్రెస్ వైఫల్యం

- ఆ పార్టీ నిర్లక్ష్యంతోనే ఎండుతున్న పంటలు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ, మార్చి 19 : దేవాదుల ప్రాజెక్టు నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యంతోనే జిల్లాలో పంటలు ఎండి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పర్సంటేజీల కోసం కక్కుర్తి, మెయింటనెన్స్ లేకనే దేవాదుల నీరందడం లేదని, తద్వారా జిల్లాకు కరువొచ్చిందని పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు ఫేస్ -3 పంప్‌హౌస్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మోటర్లు ప్రారంభించాకే ఇక్కడి నుంచి వెళ్తామని ప్రగల్భాలు పలికి దొంగల్లా పారిపోయారన్నారు. ఏ మొహం పెట్టుకొని వరంగల్‌కు వస్తారని, ఇక్కడి రైతాంగానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హెలికాప్టర్‌లో విహార యాత్రకు వచ్చినట్లు వచ్చి వెళ్లారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ హయాంలోనే 95 శాతం దేవాదుల మూడో దశ పనులు పూర్తయ్యాయన్నారు. నీటి నిల్వలు ఉన్నప్పటికి పంటలు ఎందుకు ఎండుతున్నాయో మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేవాదుల ప్రాజెక్టు మెయింటనెన్స్‌కు ఏటా రూ. 7 కోట్లు ఖర్చవుతుందని, కాంట్రాక్టర్ 20 శాతం కమీషన్ ఇవ్వనందున బిల్లులు విడుదల చేయకపోవడంతో అతడి వద్ద పనిచేసే సిబ్బంది సమ్మెతో నేడు ఈ దుస్థితి వచ్చిందని, ఈ పాపం కాంగ్రెస్ పార్టీదేనని ఆయన అన్నారు. వాళ్లకు పర్సంటేజీలపై ఉన్న శ్రద్ధ రైతాంగానికి నీళ్లివ్వడంలో లేదన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏప్రిల్, మే చివరి వరకు పంటలు పండుతాయని, అప్పటి వరకు నీళ్లు ఇవ్వాల్సిందేనని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏడాది క్రితం ప్రారంభించాల్సిన దేవాదులను ఇప్పటి వరకు ప్రారంభించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ఎండిన పంటలకు పంట నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి త్వరలో దేవాదుల పంప్‌హౌస్ పర్యటనను చేపట్టనున్నట్లు తెలిపారు. కడియం పార్టీలు మారడంపై, బిడ్డ ఎంపీ సీటు మీద దృష్టి పెట్టిండు తప్ప రైతుల గురించి ఆలోచించడం లేదని అన్నారు. నీళ్ల గురించి కొట్లాడింది కేసీఆర్, బీఆర్ఎస్ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినికాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, సీనియర్ నాయకులు సల్వాజీ రవీందర్‌రావు, నయీముద్దీన్, బండి రజినీకుమార్, నాయకులు చాగంటి రమేశ్, పోలపెల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే కుట్టుమిషన్లు

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- ఈ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందొచ్చు : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- టెక్స్‌టైల్ పార్క్‌ను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

కుట్టుమిషన్లతో మహిళలు

హనుమకొండ, మార్చి 19: మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే కుట్టుమిషన్లు అందజేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. పోచంపల్లి ఫౌండేషన్, ఏపీఎల్ హెల్త్ కేర్ ఆర్థికసాయంతో సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ వారి నిర్వహణలో మహిళలకు గతంలో ఉచిత శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై 378 మంది లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ తర్వాత వరంగల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. వరంగల్‌కు కేసీఆర్ టెక్స్‌టైల్ పార్కును తీసుకొచ్చారన్నారు. మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి నగరంలో కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని తెలిపారు. వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. వచ్చే నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 45 రోజుల పాటు మహిళలకు ఉచితంగా భోజనం పెట్టి శిక్షణ ఇచ్చామన్నారు. మహిళలు ఒకరి మీద ఆధారపడకుండా వారి కాళ్ల మీద వారు నిలబడాలని సూచించారు. అధికారంలో ఉన్నా లేకున్నా ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా కుట్టుమిషన్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ సర్టిఫికెట్స్‌తో టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. ఇప్పటి వరకు 6వేల మందికి కుట్టుమిషన్లు అందించామని, రానున్న రోజుల్లో మరో 3 వేలు ఇస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న ఏ ఒక్క పథకానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేసిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. టెక్స్‌టైల్ పార్క్‌ను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, పెద్దపెద్ద కంపెనీలకు ప్రోత్సాహకాలు తగ్గిపోయాయన్నారు. మహిళలకు ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని, వారిన మోసం చేసిందని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, వెంకన్న, రఘు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యే పెద్ది

కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీగా నందకుమార్ రెడ్డి

కాళోజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి

వరంగల్ చౌరస్తా, మార్చి 19 : కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ నందకుమార్‌రెడ్డిని నియమిస్తూ మంగళవారం రాత్రి వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం సాయంత్రం ఆయన యూనివర్సిటీకి చేరుకొని బాధ్యతలు స్వీకరించారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఆప్తమాలజీ విభాగం ప్రొఫెసర్‌గా, హైదరాబాద్ సరోజినీదేవి కంటి వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ మే 2014లో ఉద్యోగ విరమణ పొందారు. జూలై 2015 వరకు సంగారెడ్డి ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాల, జూలై 2018 వరకు మల్లారెడ్డి మెడికల్ కళాశాల, జూలై 2019 వరకు వికారాబాద్ మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మార్చి 2022 వరకు టీఆర్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పటాన్‌చెరు, 2022 నుంచి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఆప్తమాలజీ ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ మల్లేశ్వర్, జాయింట్ రిజిస్ట్రార్ డాక్టర్ రమేశ్, అడ్మిషన్ కమిటీ సభ్యుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ హేమంత్, ఫైనాన్స్ ఆఫీసర్ ఖలీద్ అభినందనలు తెలియజేశారు.

ఇక్కడ వృథా.. అక్కడ వ్యథ

పెద్దనాగారంలో లీకైన పైపులైన్

తాగునీటి కోసం తండ్లాట

నర్సింహులపేట, మార్చి 19 : వేసవి ప్రారంభంలోనే దంచికొడుతున్న ఎండలతో చెరువులు, కుంటలు ఎండిపోతూ భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. దీంతో చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతుండగా తాగునీటి ఎద్దడి తరుముకొస్తున్నది. ఈ నేపథ్యంలో ఒక గ్రామంలో తాగునీరు వృథాగా పోతుంటే, మరోచోట ప్రజలు నీటికోసం అరిగోస పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం పాఠశాల ఆవరణలోని వాటర్ ట్యాంక్ వద్ద తాగు నీరు పైపులో నుంచి వృథాగా పోతున్నది. అలాగే గ్రామంలో ని పైప్‌లైన్ కూడా లీకేజీ కావడంతో నీరంతా బయటకు వచ్చి అపరిశుభ్రంగా మారుతున్నది. ఇదిలా ఉంటే మండలంలోని చర్లచంద్రుతండా ప్రజలు అష్టకష్టాలు పడుతూ వ్యవసాయ బావుల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ప్రతి నీటిమక్కను ఒడిసిపట్టి ప్రజలకు అందించాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

పెద్దనాగారం పాఠశాలలో వృథాగా పోతున్న తాగునీరు

వ్యవసాయ బావి దగ్గర నీరు తెచ్చుకుంటున్న చర్లచంద్రు తండా వాసులు